# ధర్మం – అధర్మం

– బేతనపల్లి బోస్, Fairlawn, NJ

రీటా అమెరికా వచ్చి ఐదురోజులు గడిచిపోయాయి. శామ్యూల్‌కు సెలవు కూడ అయిపోయింది. ఆరోజు మంగళవారం. ఉదయం 6గంటలకు తయారయిన శామ్ "రీటా, నేను రావటానికి చాలా రాత్రి కావచ్చు. ధైర్యంగా ఉండు. నేను వ్రాసియిచ్చిన ప్రోగ్రామ్స్ టి.వి.లో చూసుకో. కొంచెంసేపు చదువుకో. మధ్యాహ్నం 3 గంటలకు ఫోను చేస్తావు కదూ?" మళ్ళీ ధైర్యంచెప్పి రీటాను ఒంటరిగా వదిలి వెళ్ళిపోతూ కాసేపు పడుకోమని చెపుతూ లైటు తీసేసాడు.

అపార్టుమెంటులో చీకటిగా ఉంది. చీకటి అంటే రీటాకు భయం. చీకట్లో దెయ్యాలు తిరుగుతుంటాయి అంటారు. దేవుడంటే భయంలేని వాళ్ళు ఎక్కువమందే ఉంటారేమో! కాని, దయ్యం అంటే భయంలేని వాళ్ళు తక్కువమంది ఉంటారు. మరుక్షణం కళ్ళు గట్టిగా మూసుకొంది. స్ప్రింగులా గెంతి లైటువేసింది. కర్టెను పూర్తిగా తీసింది. అద్దాలగోడ నుండి వెలుగు రావడం వల్ల అపార్టుమెంటు లేత వెలుగుతో నిండిపోయింది.

వెలుగువల్ల భయంతగ్గింది. గ్లాస్ వాల్‌గుండా బయటి ప్రకృతిని, పరిగెత్తుతున్న కార్లను, వడివడిగా నడుస్తున్న మనుష్యుల్ని పరిసరాలను చూస్తూ గడిపింది కొంతసేపు. ఇప్పుడు బాధ మొదలయింది–ఒంటరితనపు బాధ. శామ్యూల్ ఇంట్లోవున్న ఐదురోజుల్లో ఏమీ అనిపించలేదు. ఇంతలోనే ఎంత వంటరితనం! జీవితంలో ఇంత ఒంటరిగా ఎప్పుడు లేదు. ఒంటరితనానికి తోడు నిశ్శబ్దం బాధను రెండింతలు చేస్తుంది. టి.వి. ఆన్ చేసింది. అర్థంకాక కట్టేసింది. రేడియో పెట్టింది. అర్థం కాకపోయినా శబ్దం బాగుంది. వెలుగు కాస్త ఎక్కువయి భయం తగ్గింది.

కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీ చేసుకొని కూర్చుంది. కాసేపు ఆలోచన చేసిన తరువాత కిచెన్ క్లీన్ చేసి, గ్రోసరీ అంతా సర్దింది. ప్రతి అంగుళం కదిలించి చూస్తూ ఏది ఎక్కడుందో తెల్సుకొంది. ఇల్లు నీట్‌గా సర్ది తృప్తిగా చూసుకొంది. కావాల్సిన సామాన్ల పట్టిక వ్రాసుకుంది.

పనితో కొంత టైమ్ బాగానే గడిచిపోయింది. పని అయిపోగానే ఒంటరితనపు బాధ తిరిగి మనసులోకి ప్రవేశించింది. మాట్లాడటానికి మనిషి లేకపోవడం శిక్షలాగానే ఉంది. కాస్త భయం కూడ అవుతుంది. టైమ్ ఎంతకూ కదులుతున్నట్లు లేదు. క్షణం గడవడం భారంగా ఉన్నట్లు ఉంది. అద్దాల గోడ దగ్గరే నిలబడి బయటి ప్రపంచంలోకి చూస్తూవుండిపోయింది చాలాసేపు. లంచ్‌టైమ్ అయిపోతున్నా తినటానికి మనసులేక ఏమీ తినలేదు.

బయట ఎండ ఎర్రగా ఉంది. చలి అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ ఐదురోజుల్లో ఒకసారి చర్చికి తీసుకెళ్ళాడు. ఆదేరోజు చకచకా అన్నీ చూపించి ఇంటికి తీసుకొచ్చాడు. చలి తనను బాధించినట్లు అనిపించలేదు. శామ్యూల్ బలవంతం మీద హెవీగా డ్రెస్ చేసుకొంది. అంతే. కాసేపు బయట తిరిగితే బావుణ్ణు అన్నకోర్కె జనించింది రీటా మనసులో. టైమ్ చూసుకొంది. మధ్యాహ్నం 2 గంటలు కావస్తూంది. శామ్యూల్‌కి 3 గంటలకు ఫోను చెయ్యాలి. నంబరు తీసుకొంది. గ్రోసరీ లిస్ట్, డబ్బులు తీసుకొని తాళంవేసి బయటకు నడిచింది.

వీధిలోకి వచ్చిన రెండు మూడు నిమిషాలు గడవకముందే శరీరంలో ఏదో మార్పు వస్తున్నట్లు గ్రహించింది. శరీరం చల్లగా అయిపోతున్నట్లు, సూదులతో గ్రుచ్చుతున్నట్లుగా ఫీలయింది. ఒళ్ళు ఒణకడం మొదలయింది. పళ్ళు టకటక కొట్టుకొంటున్నాయి. అప్పటికే వీధిలో సగం దూరం నడచిన రీటా పరుగుతో వెనుదిరిగి బిల్డింగ్‌లోకి వచ్చింది. ఎండయితే ఎర్రగా ఉంది. మరి ఇంత చలిగా ఎందుకువుందో? అదొక వింతే అనిపించింది రీటాకు. ఎముకలు కొరికే చలి అంటే ఇదే గాబోలు! ఎక్కడో చదివిన వాక్యం ఇప్పుడు అనుభవం అయ్యింది. అనుభవానికి మించిన పాఠం లేదంటారు.

ప్రపంచానికి ఇండియా తూర్పున ఉంది. తూర్పున ఉదయించిన సూర్యుడు–పడమరలో ఉన్న అమెరికా వచ్చేటప్పటికి పవర్ తగ్గిపోయి డల్‌గా అయిపోయాడా? ఎండ తీక్షణంగా వుంది....వేడి లేదు. భలే, సూర్యుడు ఇండియాలో హీరో అయితే అమెరికాలో జీరో అయిపోయాడు. ఇండియాలో వీచని గాలిదేవుడు తన బలమంతా అమెరికాలోనే కేంద్రీకరించాడా అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది.

శరీరం కదలడంతో కాస్త వేడి పుట్టింది. హెవీగా డ్రెస్ చేసుకోవడం వల్ల ఈసారి బయట నడుస్తున్న రీటాను చలి అంతగా బాధించలేదు. దిక్కులు చూస్తూ వీధులన్నీ గుర్తుపెట్టుకుంటూ నాలుగు వీధులు దాటిన తరువాత అక్కడవున్న టెలిఫోన్ బూత్‌కి చేరుకొంది. శామ్యూల్ ఎలా ఫోన్ చెయ్యాలో ఒకసారి చూపించాడు. అదంతా గుర్తు చేసుకొంది. రిసీవర్ పక్కనపెట్టింది. ఒకచేతిలో నంబరు వ్రాసివున్న అడ్రసుబుక్ పట్టుకొని, రెండవచేతితో కాయిన్ వేసి శామ్యూల్ చెప్పినట్లుగా డయల్ చేసింది. నంబర్స్ నొక్కిన తరువాత రిసీవరు చెవిదగ్గర పెట్టుకొంది. ఎందుచేతనో కనెక్షను రాలేదు. మళ్ళీ ట్రై చేసింది. రాలేదు. ఏమిచెయ్యాలో తోచలేదు.

"మే ఐ హెల్ప్ యూ"? అన్న గొంతు అతి దగ్గరలో వినిపించడంతో గబాల్న వెనక్కి తిరిగింది. క్షణంపాటు భయంవేసింది. అలాగే నిలబడి అతన్నే చూస్తూంది. నవ్వుతూ నోట్లో సిగరెట్టుతో నిలబడ్డ వ్యక్తిని చూసినట్లుగానే ఉందిగాని గుర్తురాలేదు.

"భయపడకండి. నాపేరు రాబర్టు. ఎయిర్‌పోర్టు–పికప్–ఇంటిదగ్గర డ్రాప్" అంటూ నాటకీయంగా పరిచయం చేసుకొన్నాడు. అప్పుడు గుర్తొచ్చింది అతను ఎవరైందీ.

రీటాను చూస్తూ "ఫోన్ చెయ్యాలి అంతేగదా–సింపుల్. రిసీవరు చెవి దగ్గర పెట్టుకొని డయల్‌టోన్ వినిపిస్తుందా లేదా చూడాలి. డయల్‌టోన్ వినిపించకపోతే అది డెడ్‌ఫోన్ అనుకోవాలి. ఈ ఫోన్‌కి డయల్‌టోన్ వస్తూందిగదా, ఇప్పుడు డబ్బులు వెయ్యండి స్లాట్లో" అన్నాడు. "ఇప్పుడు మీరు పది నంబర్లు ప్రెస్ చెయ్యాలి. ప్రెస్ చేసిన ప్రతిసారీ బీప్ శబ్దం విన్పించాలి" రాబర్టు చెప్పినట్లే ప్రతి నంబరు బీప్ శబ్దం వస్తూ, ఒక్క నంబరు మీద మాత్రం రాలేదు. అంటే, మీకు కనెక్షను రానట్లే. ఇప్పుడు ఈ లీవరు నొక్కండి అంటూ కాయిన్ రిటర్న్ చూపించాడు. లీవరు నొక్కగానే ఒక్కవేలు మాత్రం పట్టేటట్లు వున్న ఆ పాకెట్‌లోనుండి డబ్బులు తీసుకుంది.

మరో నాలుగు బ్లాకులు నడిస్తే ఫోనువుంది అంటూ దారితీశాడు. దారిలో అతను సెక్యూరిటీ ఆఫీసరుగా పనిచేస్తున్నట్లు చెప్పాడు. నైట్‌డ్యూటీ కావడంవల్ల పగలు ఇంటిదగ్గరే ఉంటాడు. పోలీస్ డిపార్టుమెంటు తరువాత సెక్యూరిటీ డిపార్టుమెంటు చాలా స్ట్రాంగ్ అన్నాడు. పెండ్లి కాలేదు. రీటా వాళ్ళ బిల్డింగుకు వ్యతిరేకంగా రోడ్డు అవతలివైపు బిల్డింగులో ఉంటాడు.

పరిసరాలను గమనిస్తూ మెల్లగా నడుస్తూ టెలిఫోన్ బూత్ చేరుకున్నారు. రాబర్టు చెప్పినట్లుగానే ఈసారి అన్ని నంబర్లు మీద బీప్ శబ్దం రావడం–చివరిలో థాంక్యూ అన్న గొంతు విన్పించడం–అవతలివైపు రింగ్ అవడం స్టార్ట్ అయింది. మీరు

మాట్లాడుకోండి అంటూ ప్రైవసీని భంగపరచకూడదన్నట్లు దూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

కళ్ళతోనే థాంక్యూ అన్నట్లు చూసి ఫోను చెవి దగ్గర పెట్టుకొని 'హలో' అంది. శామ్ మాట్లాడుతుంటే రీటా వింటూవుంది. ఒంటరిగా వదిలి వెళ్ళడం ఎంత బాధగావుందో చెప్పలేనంటూ మాట్లాడాడు."అమెరికాలో ఒంటరితనం ఎక్కువ. ఇక్కడ ఉండాలని వచ్చినవాళ్ళు ఈ ఒంటరితనపు బాధ అనుభవించక తప్పదు. ధైర్యంగా ఉండు. కాలక్షేపానికి ఏదో ఒకటి కల్పించుకోకపోతే బుర్ర పిచ్చెక్కిపోతుంది. జాగ్రత్త. సీయూ ఎట్ హోమ్" అంటూ ఫోన్ పెట్టేశాడు.

రీటాకు ఎంతో ఆనందంగా ఉంది. తెలుగులో మాట్లాడే మనిషి దొరికాడు. రెండు, ఎలా ఫోను చెయ్యాలో బాగా తెలిసిపోయింది. ఇంకోసారి థాంక్యూ అన్నట్లు చూసింది రాబర్ట్సువైపు. ఫరవాలేదులే అన్నట్లు చూస్తూ " నెక్సుఏమిటి" అన్నాడు. "కొంచెం గ్రోసరీస్ కొనాలి" అంది రీటా.

"ఇంకో మూడు బ్లాకులు నడిస్తే షాప్‌రైట్ ఉంది" అంటూ దారితీశాడు.

షాప్‌రైట్ ఎంట్రన్స్ దగ్గర చాలా షాపింగ్ కార్ట్సు ఉన్నాయి. రీటాను చూస్తూ "ఇక్కడ మనం రెండు పాయింట్సు గుర్తు పెట్టుకోవాలి. షాపింగు బండివి వీల్సు ఫ్రీగా తిరుగుతున్నాయో లేదో చూసుకోవాలి" అంటూ ఒక బండిని తీసుకున్నాడు టెస్టు చేయడానికి.

"వీల్సు ఫ్రీగా తిరక్కపోతే గానుగ ఎద్దులాగా ఎంతత్రోసినా అక్కడే గిరికీలు కొడుతుంది తప్ప ముందుకుపోనని మొరాయిస్తుంది ఈబండిలాగే" అంటూ టెస్టుచేస్తున్న బండిని రీటాకు యిచ్చి తొయ్యమన్నాడు. రీటా బండిని తోసింది గాని ముందుకు వెళ్ళేదానికి బదులు సైడుకు వెళ్ళడం జరిగింది. దానిని వదిలిపెట్టి ఇంకో బండి తీసుకొని చెక్‌చేసి సంతోషం వ్యక్తం చేసింది.

"రెండవ పాయింటు లోపల చెబుతాను పద" అంటూ లోపలకు తీసుకొని వెళ్ళాడు. లోపలకు వచ్చిన తరువాత రీటా అలానే నిలబడిపోయింది చుట్టూచూస్తూ. ఎంతో పెద్దదిగా ఉన్న షాపు అది. రోడ్లమీద ఎంతో పలుచగా కనికన్పించనట్లుండే మనుష్యులు ఒకసారిగా పెద్దగ్రూపులా లోపల వున్నారు. అందులో చాలామంది నల్లవాళ్ళు. అక్కడక్కడ తెల్లవాళ్ళు వున్నారు. రాబర్ట్సు వైపు చూస్తూ "నల్లవాళ్ళంతా ఒకలాగే ఉన్నారు చూడటానికి. తెల్లవాళ్ళు కూడా అంతే." అంది సందేహంగా.

రాబర్ట్సు నవ్వుతూ "నల్లవారిని(తెల్లవారిని) జూడ, అంత నొక్కటిగ నుండు
తేరిపార చూడ తేడాలు తెలియు
మందియందునైన, ప్రతిమనిషి వేరయా
విశ్వదాభిరామ వినుర వేమ."

అంటూ పద్యం చదివి, నవ్వు ఆపకుండానే "గుంపులో ఎన్ని గేదెలు వున్నా గేదెల్ని కాచే కుర్రాడు మాత్రం ఎవరి గేదె ఏదో ఖచ్చితంగా చెప్పగలడు. ప్రాక్టీసు, పరిశీలన, అంతే" అన్నాడు.

రీటా మనుష్యుల్ని, షాపులో సామాన్లని పరిశీలిస్తూ ఉండిపోయింది. రాబర్ట్సు మెల్లగా "ఏమి కొనాలి? లిస్ట్ ఉందా?" అన్నాడు.

రీటా ఇచ్చిన లిస్ట్ చూస్తూ "మనకు కావాల్సిన సామాన్లు షాపింగ్ కార్ట్ మీద వున్న ఇండెక్సులో ఎక్కడవున్నయో వెతకాలి. అవి కన్పించగానే ఆ ఐటమ్‌కి ఎదురుగా వున్న నంబరు, మన పట్టికలో మన ఐటమ్ ముందు నోట్ చేసుకోవాలి"



అని చెపుతూ రీటాకు కావాల్సిన నాలుగు వస్తువులు ఇండెక్స్‌లో చూసి నంబర్లు నోట్‌చేశాడు. "ఈ నంబర్లు ఐల్ నంబర్లు. అంటే మన నాలుగు వస్తువుల గురించి ఈ నాలుగు ఐల్స్ తిరిగితే సరిపోతుందన్నమాట. మిగత 24 ఐల్స్ తిరక్కుండా మనకు టైమ్ సేవ్ అవుతుంది. ఇండెక్స్‌లేని పుస్తకంలో మనకు కావాల్సిన ఆర్టికల్‌ని గురించి పేజి తరువాత పేజి తిప్పితే గాని తెలియనట్లు, ఇండెక్సు లేని షాపింగు బండికూడా మనల్ని ప్రతి ఐల్ కు తిప్పుతుంది. ఇదే రెండవ పాయింటు." అన్నాడు.

"వీల్సు ఫ్రీగాలేని బండిని తోయడం వల్ల చేతులకు నొప్పి, ఇండెక్సు లేని బండి వల్ల కాళ్ళకు నొప్పి. అంతేగా!" అంది సంతోషంగా.

"అమ్మయ్య! నీకు పాయింట్సు తెలిసినందుకు నాకు ఎంతో సంతోషం" అంటూ గలగలా నవ్వాడు రాబర్ట్సు. ఇంగ్లీషు పేర్లు త్వరగా నేర్చుకోవాలి అని చెపుతూ బొమ్మలతో ఉన్న సేల్ పేపర్లు షాపింగు కార్టులో వేశాడు.

షాపింగు ముగించుకొని ఇంటిముఖం పట్టారు. దారిలో "ఎండ ఇంత తీవ్రంగావుంది. చలిమాత్రం దంచేస్తూంది" ఏమిటీవింత అన్నట్లు చూసింది.

"భూగోళానికి నార్త్‌పోల్, సౌత్‌పోల్ ఉంటాయని చదివాము. పోల్స్ దగ్గర అతి శీతలంగా ఉంటుందని చదివాము కదా. మనం, అమెరికావాసులం నార్త్‌పోల్‌కి కాస్త దగ్గరగా ఉన్నాం. అంతే. ఈ చలిగాలి అంతా మన పొరుగున, నార్త్‌పోల్‌కి మరింత దగ్గరగావున్న కెనడానుండి దిగుమతి అవుతున్నదే. ఎండ ఎంత తీవ్రంగా ఉన్నా విండ్‌చిల్ ఫాక్టరు వల్లే ఆరోజు చలి మనల్ని బాధిస్తుందా లేదా అన్నది తెలిసిపోతుంది" అన్నాడు.

కొద్ది నిముషాలముందే తను ఒంటిమీద స్వెట్టరుతో బయటికి వచ్చి చలిగాలికి ఒణికిపోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది రీటాకు. బిల్డింగు ముందు వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయాడు రాబర్ట్సు. తెలుగులో మాట్లాడే మనిషి దొరికినందుకు, కంపెనీ ఇచ్చినందుకు, చాలా విషయాలు తెలుసుకొన్నందుకు రీటాకు సంతోషం కలిగింది. స్నేహశీలి, హాస్యప్రియుడు, గొప్ప టీచరు, మంచివాడు అనుకొంది రాబర్ట్సు గురించి.

శామ్ రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటివరకూ ఆత్రంగా ఎదురుచూస్తున్న రీటా మనసు కుదుటపడింది.

భోజనం చేస్తున్నపుడు ఆరోజు అనుభవాలు ఒకటిఒకటిగా– తను అనుభవించిన ఒంటరితనం, భయం, ఆందోళన గురించి, బయటకు వెళ్ళిన తనకు రాబర్ట్సు కన్పించడం, అతను చేసిన సహాయం, అన్నింటిని గురించి హుషారుగా చెప్పింది.

అంతావిన్న శామ్ ముభావంగా "ఏ పని అయినా నాలుగుసార్లు చేస్తే అదేవస్తుంది. మనంతట మనం చేసుకోవటానికి ట్రై చేయాలి. దాంట్లో ఉన్న తృప్తి, ఆనందం ఇతరుల సహాయంతో చేస్తే ఏముంటుంది" అన్నాడు అదోలా.

"నాలుగుసార్లు చేస్తే అదే వస్తుందిలే, అదే అలవాటయి పోతుందిలే" అని వినడం ఇది రెండవసారి రీటాకు. ఇతరుల నుండి ఎందుకు సహాయం తీసుకోకూడదో, గంభీరంగా వున్న శామ్‌ని చూసి రీటా అడగలేకపోయింది. శామ్ చెప్పలేదు కూడా.

"రాత్రికి స్నో అంటున్నారు. రేపు ఎలావుంటుందో పరిస్థితి. ప్రార్థన చేసుకుని పడుకుందాం రా!" అంటూ లైట్ తీసేశాడు........ఇంకావుంది.

